


# నెలనెలా నవ్వుల పండగ

## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఓ హెలికాప్టర్‌లో ఆరుగురు రాజకీయనాయకులు వెళుతుండగా అది ఓ పొలంలోని ఒక చెట్టుకొమ్మకి తగిలి కూలిపోయింది. పొలానికి వచ్చిన రైతు ఏం జరిగిందో గ్రహించి పెద్ద గుంట తవ్వి వాళ్ళని అందులో పూడ్చాడు.

సాయంత్రం పోలీసులు వచ్చి అడిగారు
"అంతా మరణించారా? ఒక్కరూ బ్రతికి లేరా?"

"కొందరు తాము బ్రతికే ఉన్నామన్నారు. కాని రాజకీయనాయకుల మాటలు నమ్మేవారెవరూ లేరిక్కడ!: జవాబు చెప్పాడా రైతు!

## బౌబౌ... పేరుకొచ్చిన నవ్వులు

ఆ సినీ హీరో, హీరోయిన్‌లు అంతవరకు ఏ చిత్రంలోనూ కలిసి నటించలేదు. చివరికో దర్శకుడు వారిద్దర్ని ఓ చిత్రం కోసం బుక్ చేశాడు.

తొలి షాటు చిత్రీకరణ రోజున సెట్‌మీద కలిశారిద్దరూ. హీరోయిన్ హాస్యంగా హీరోతో "నేను మీకన్నా ఎత్తుగా ఉన్నట్లున్నానే" అంది.

అందుకు హీరోగారు తడుముకోకుండా "ఫర్వాలేదు... త్వరలోనే నా ఎత్తుకి తగినట్లు మిమ్మల్ని తగ్గిస్తాగా" అని జవాబిచ్చాడు.

ఓ ప్రముఖ సినీ హీరోగారు తనో సూపర్ మార్కెట్ ప్రారంభిస్తున్నట్లుగా ప్రకటన చేశాడు. అభిమానులు ఉత్తరాలు రాస్తూ, "మీరు మంచి కళాత్మక చిత్రాలు నిర్మిస్తారనుకుంటే ఇదేంటంటూ" ఆశ్చర్యం ప్రకటించారు.

దానికతగాడు నవ్వుతూ "ముందు ముందు నాకు మార్కెట్ లేదని మీరు అనుకోకుండా" అని ఓ ప్రకటన చేశాడు.

ప్రఖ్యాత అమెరికన్ రచయిత మార్క్‌ట్వైన్ మరణించాడని పుకారుపుట్టి ప్రచారమైంది. ఓసారి, ఆ వార్త మీద వ్యాఖ్యానించమని కొందరు ఆయన్నే అడగ్గా మార్క్‌ట్వైన్ గొంతు సవరించుకుని "నా మరణానికి సంబంధించిన వార్తలను మరీ గోరంతలు కొండంతలు చేసి చెపుతున్నారు" అన్నాడు ఒక్క ముక్కలో.

ఓ సంగీత సభ జరుగుతూంది. వినడానికి వచ్చిన వారితో హాలు నిండిపోయింది. మీనాక్షి "అదేమిటే! ఆవిడ పాడేటప్పుడు కళ్ళు మూసుకునే పాడుతుంది దేమిటి?" అని ఆరా తీసింది.

అందుకు కామాక్షి జవాబు "ఆవిడ ఎదుటివారు బాధ పడుతూంటే చూడలేదు పాపం. అందుకని ఎప్పుడూ కళ్ళుమూసుకునే పాడుతూందిలే" "

ఓ మహారాజావారు గుర్రబ్బగ్గీలో ప్రయాణం చేస్తూ ఓ చిన్న ఊరు చేరారు. ఆకలితో అయ్యవారు నకనకలాడిపోతున్నారు. అందుకని ఓ చిన్న హోటలు ముందు బండాపి భోజనం చేశారు. రెండు కోడిగుడ్లు, ఓ చపాతి మాత్రమే ఉన్న మామూలు భోజనానికి హోటలు యజమాని పాతిక రూపాయలు తీసుకోవడంతో మహారాజావారు ఆశ్చర్యపోయి "ఏమయ్యా! ఈ ప్రాంతంలో కోడిగుడ్లు దొరకవా? ఇంత ధరపెట్టారేమిటి?" అనడిగారు.

హోటల్ యజమాని "కోడిగుడ్ల కిక్కడ కొదవేమీ లేదు మహారాజా. ఎటొచ్చీ మహారాజులే అరుదుగా దొరుకుతారిక్కడ" అన్నాడు వినయంగా.

ఓ రాజకీయ పార్టీ సభ్యుడు, రాజకీయాల వాసన పడని ఓ మిత్రుడితో సరదాగా చేపలు పట్టడానికి వెళ్ళాడు. అతని మిత్రుడికి చేపలు తెగ దొరికాయి. రాజకీయవాదికి ఒళ్ళు మండిపోయింది ఒక్క చేపన్నా దొరకనందుకు.

"ఇదేమిటి నీకన్ని చేపలు దొరికితే నాకు కనీసం ఒక్కటన్నా దొరకలేదు" అన్నాడు విసుగ్గా.

"ఏముందీ? నీ ఖద్దరు చొక్కా, పంచా చూసి చేపలు కూడా నోరు విప్పడానికి భయపడుంటాయి" అన్నాడు మిత్రుడు.

విడాకుల కేసులో భార్య "ఎంతసేపు ఈయన గుర్రాలు గుర్రాలంటూ రేసు గుర్రాల్ని కలవరించడమేగానీ, నా విషయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదెప్పుడూ. కనీసం మా వివాహ వార్షికోత్సవం కూడా ఆయనకి గుర్తులేదంటే నమ్మండి" అంది.

దానికి భర్తగారు జడ్జీ వంక తిరిగి "ఆమె మాటలు నమ్మకండి యువరానర్! గత ఏప్రిల్‌లో మూడో శనివారం బెంగుళూర్ రేసుల్లో సిల్వర్‌క్వీన్ థర్డ్ రేసులో గెలిచిన రోజే మా పెళ్ళి జరిగింది"

కొత్తగా పెళ్ళయిన భార్యా భర్తలు బస్సులో వెళ్తూ చాలా పరవశంగా మాట్లాడుకుంటున్నారు.

"ప్రేమ గుడ్డిదన్నారు గదా! అందుకని కళ్ళు మూసుకుని ముద్దు పెట్టుకుని చూద్దామా?" అన్నాడు భర్త.

"అవునవును. చూద్దాం" అంది భార్య.

"కానీ లోకం గుడ్డిది కాదు బాబూ! కాస్త ఏదన్నా అద్దం చూసుకుని మరీ ముద్దెట్టుకోండి" అన్నాడు వెనకనున్న ప్రయాణీకుడు.

.

COMMENTS